بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

సంపుటి 1 | సంచిక 27

వార్షిక చందా 300/-రూ॥

వార పత్రిక బదర్ ఖాదియాన్

The Weekly BADAR Qadian TELUGU

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

www.akhbarbadrqadian.in

05 జుల్ హజ్ 1437 హి.ఖ, 08 తబూక్ 1395, హి.శ, 08 సెప్టెంబర్ 2016


## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మునినీన్ అయ్యదహు తాలా బినస్రిహిల్ అజీజ్ అల్లాహ్ తాలా దయతో క్షేమంగానే యున్నారు. అల్‌హందులిల్లాహ్.

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ ఆయురారోగ్యము, ఉన్నత ఆశయాల సాధన, ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు కొనసాగించ గలరు. అల్లాహ్ తాలా అనుక్షణం హుజూర్ ను రక్షించుచు సహాయ, సహకారాము అందించుగాక! (ఆమీన్)

**మన ప్రియతమ నాయకుడు, ప్రజాసేవకుడు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రపంచము మొత్తమునకు ప్రవక్తగా అవతరించినందున నాకు ఈ ప్రపంచ సంస్కరణ బాధ్యతను అప్పగించడం జరిగినది. అంతేగాకా ఆ బాధ్యతను నెరవేర్చుటకు కావలసిన శక్తులను కూడ ఆయా బాధ్యతలకు అనుగుణంగానే నాకు ప్రసాదించడం జరిగినది. అదే విధముగా సమయానుకూలంగా ప్రదర్శితమయ్యే అద్భుతాలను కూడ నా నిదర్శనానికి చిహ్నంగా చూపించడం జరిగినది.**

**ఉపదేశములు : హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం**

గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటనగా మన ప్రియతమ నాయకుడు, ప్రజాసేవకుడు హజ్రత్ ముహమ్మద్ (స) ప్రపంచము మొత్తమునకు ప్రవక్తగా అవతరించినందున నాకు ఈ ప్రపంచ సంస్కరణ బాధ్యతను అప్పగించడం జరిగినది. అంతేగాకా ఆ బాధ్యతను నెరవేర్చుటకు కావలసిన శక్తులను కూడ ఆయా బాధ్యతలకు అనుగుణంగానే నాకు ప్రసాదించడం జరిగినది. అదే విధముగా సమయానుకూలంగా ప్రదర్శితమయ్యే అద్భుతాలను కూడ నా నిదర్శనానికి చిహ్నంగా చూపించడం జరిగినది. కాని హజ్రత్ ఈసా (అ) కు ఇలాంటి అద్భుతములు ఇవ్వవలసిన అవసరం ఏమియు లేదు. + ఎందుకనగా ఆ సమయంలో ఆ నిదర్శనముల అవసరము లేకుండెను. అందువలనే కేవలం కొద్ది మంది కల్గిన యూదుల సంస్కరణకు పంపబడిన హజ్రత్ ఈసా (అ) కు పరిమిత అద్భుతములను మాత్రమే చూపించే శక్తులను ప్రసాదించడం జరిగినది. మనము పవిత్ర ఖుర్ఆన్‌కు వారసులము. ఆ గ్రంధపు బోధనలు ప్రపంచము మొత్తమునకు కావలసిన నిదర్శనములన్నింటిని కల్గి యున్నవి. కాని హజ్రత్ ఈసా (అ) కేవలం తౌరాత్ బోధనలకు మాత్రమే పరితమైరి. దాని బోధనలు అసంపూర్ణమైనవిగా, బలహీనమైన నిదర్శనములు కల్గినవిగా ఉన్నవి. అందు వలనే తౌరాత్‌లో భవిష్యవాణిలుగా పేర్కొనబడిన విషయాలను ఇంజీల్‌లో పదే పదే శ్రద్ధను చూపించుచు పేర్కొనడం జరిగినది. కాని పవిత్ర ఖుర్ఆన్‌లో అలా పదే పదే పేర్కోనవలసిన అవసరం రాలేదు. ఎందుకనగా అది సంపూర్ణమైన బోధనలు గల పరిపూర్ణ గ్రంధము. అంతేగా కుండా దానికి తౌరత్ వలే తనను తాను పరిపూర్ణం చేసుకొనుటకు ఇంజీల్ వంటి మరే అనుబంధ గ్రంధపు అవసరం లేదు.

మరల ఈ విషయము బహిర్గతమవుచున్న స్థితిని పరిశీలించినచో మనకు తెలియునది ఏమనగా హజ్రత్ ఈసా అలైహిస్సలాంకు కేవలం యూదుల సంస్కరణకు సరిపడునంత ఆధ్యాత్మిక శక్తిని మాత్రమే ఇవ్వడం జరిగినది. అందువలనే వారి అద్భుతాలు కూడ ఆ శక్తికి అనుగుణంగానే ఉన్నవి. ఈ విషయమును గూర్చి అల్లాహ్ తాలా **"వఇన్ మిన్ షైయిన్ ఇల్లా ఇందనా ఖజాయినుహు వమా నునజ్జిలుహు ఇల్లా బిఖదరిన్ మాలూమ్"** (అల్‌హిజ్ర్:22) అనగా అన్ని వస్తువుల భండాగారం మా వద్ద యున్నది, కాని మేము అవసరమునకు మించి దానిని బహిర్గతము చేయము. కావున ఒక సమాజ సంస్కరణకు కావలసిన వివేకం కన్న అధిక వివేకంను ప్రసాధించుట అనునది అల్లాహ్ తాలా విజ్ఞతతో కూడిన శాసనంనకు భిన్నమైన చర్య అగును. ఈ విజ్ఞత గల శాసనం కేవలం మానవులలోనే కాకుండ జంతువులలో కూడ కొనసాగుతుంది. ఉదా॥ సుదూర ప్రాంతాలలో సునాయసంగా ప్రయాణించుటకు, మరియు అన్ని ప్రాంతాలలో వేగంగా పరుగెత్తుచు తన ప్రయాణికునికి సహకరించునట్లుగా, విశ్వసనీయతను కల్పించునట్లుగా మారుటకు అల్లాహ్ తాలా గుర్రమును పుట్టించెను. అదే విధముగా నీటిని దాహం తీర్చుటకు పుట్టించెను. అందుకే నీటికి ప్రాతినిధ్యం నిప్పు వహించలేదు. మానవుని భాగ్యము అనేక కర్మలలో పంచబడినది. ఆ భాగ్యములో అల్లాహ్ తాలా ఎన్నో రకాల శక్తులను మమేకం చేసెను. కాని ఇంజీల్ మాత్రం కేవలం ఒకే ఒక శక్తిని అనగా క్షమించుట, మన్నించుటనే పదే పదే బోధించినది. దీని అర్ధం మానవ వృక్షములో గల వందల కొమ్మలలో కేవలం ఒకే ఒక కొమ్మ ఇంజీల్‌లో గలదు. ఈ ఒక్క విషయం ద్వారనే హజ్రత్ ఈసా (అ) విజ్ఞత స్థాయి ఎంత వరకు ఉండునో దాని వాస్తవికత మనకు అర్ధమవుచున్నది. కాని మానవ స్వభావపు పాతాళం వరకు చేరుకొను విజ్ఞతను మన ప్రియతమ ప్రవక్త (స) కల్గి యున్నారు. అందుకే వారి (స) పై పరిపూర్ణమైన పవిత్ర ఖుర్ఆన్ అవతరించినది. ఇందులో తప్పుగా భావించు అంశం ఏదియు లేదు. అల్లాహ్ తాలా స్వయంగా **"ఫజ్జల్‌నా బ ఆజుహుం అలా బ ఆజీన్"** (అల్‌బఖరహ్:254) అని తెల్పెను. అనగా మేము కొంత మంది ప్రవక్తలకు మరి కొందరి ప్రవక్తలపై ప్రాధాన్యతను చేకూర్చినాము. అందువలనే సుగుణాలలో, ఆరాధనలలో ఆదేశాలన్నింటిలో హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను మాత్రమునే అనుసరించుమని నన్ను ఆజ్ఞాపించడమైనది. ఒకవేళ హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం శక్తులన్నింటిని ప్రతిగా స్వీకరించు సామర్ధ్యములను నా స్వభావమునకు ఇవ్వకున్నచో ఆ మహా ప్రవక్తను అనుసరించుమని అల్లాహ్ తాలా నన్ను ఆదేశించువాడు కాదు. ఎందుకనగా అల్లాహ్ తాలా ఒకరి సామర్ధ్యంను మించి వారికి బాధ్యతలను అప్పగించడు. ఈ విషయమునే అల్లాహ్ తాలా **"లా యు కల్లిఫుల్లాహు నఫ్‌సన్ ఇల్లా ఉస్‌అహా"** (అల్‌బఖరహ్:284) లో తెలిపెను. అంతేగాకా ప్రవక్తలందరి ప్రావీణ్యతలన్నియు హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త (స)లో గలవనే విషయం కూడ అల్లాహ్‌కు తెలుసు. అందువలనే అతడు మనకు ప్రతి రోజు ఐదు పర్యాయపు నమాజ్‌లలో **"ఇహ్ దిన స్సిరాతల్ ముస్తఖీమ సిరాతల్లజీన అన్ అంత అలైహిం"** (అల్‌ఫాతిహ్:6,7) అనే దుఆను నేర్పించడం జరిగినది. అనగా ఓ అల్లాహ్ ! మా పూర్వం ప్రవక్తలు, సందేశహరులు, సత్యవంతులు, అమరులు అవతరించారు. వారందరి ప్రావీణ్యతలను మాలో సమకూర్చుము. కావున ఈ దుఆ తో గడిచిన అవతారుల ప్రావీణ్యతలను తమలో సమకూర్చుకోవలెననే ఆదేశం బలహీన స్థితిలో ఉన్న ఈ సమాజంనకు గలదని తెలియుచున్నది. ఇది కేవలం ఒక సాధారణమైన ఆదేశమే అయినను ప్రత్యేక ఆదేశాల అంతరంగికం కూడ వీటి ద్వారనే మనకు తెలియును. అందువలనే మానవ స్వభావంను కేవలం ఈ సమాజమే పరిపూర్ణం చేయుననే రహస్యంను ఇస్లామీయ సత్పురుషులు గుర్తించిరి. వాస్తవము ఏమనగా ఏ విధముగానైతే ఒక చిన్న విత్తనమును భూమిలో విత్తగా అది నెమ్మది నెమ్మదిగా తన శక్తినంత కూడగట్టుకొని ఒక మహా వృక్షముగా మారుతుంది. అదే విధముగా మానవుని వృద్ధి పరంపర కూడ కొనసాగుతుంటుంది. ఈ విధముగానే మానవుని శక్తులు వృద్ధి చెందుతుంటాయి. ఇలా వృద్ధి చెందుతూ చివరికి అవి మన మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కాలం నాటికి అవి తమ శిఖర స్థాయికి చేరుకున్నవి.

\+ హజ్రత్ ఈసా అలైహిస్సలాం మృతులను సజీవులుగా మార్చేవారని, ఇది చాలా అరుదైన అద్భుతమని ఒకవేళ ఎవరైనా ప్రస్తావించినచో అందుకు సమాధానం ఏమిటనగా వాస్తవంగా మృతులను సజీవులుగా మార్చడం అనునది పవిత్ర ఖుర్ఆన్ బోధనలకు విరుద్ధమైనదని గుర్తుంచుకోవాలి. కాని ఒక వేళ ఆధ్యాత్మికంగా మరణించిన వారిని సజీవులుగా చేసినచో అలా గత కాలపు ప్రవక్తలందరు చేసి చూపిరి. ఉదా॥ ఇల్యాస్ ప్రవక్త మొ॥వారు. కాని అత్యంత శక్తివంతమైన నిదర్శనములు వేరుగా ఉన్నవి, వాటిని అల్లాహ్ తాలా ప్రదర్శిస్తున్నాడు, ఇక ముందు కూడ ప్రదర్శించును.

(హఖీ ఖతుల్ వహీ, రూహాని ఖజాయిన్ సంపుటి 22, పుట 155-157)

**122 వ వార్షిక సభ ఖాదియాన్ (ప్రారంభించి 125 సంవత్సరములు) 26, 27, 28 డిశంబర్ 2016 తేదీలలో జరుగును. ఇన్షాఅల్లాహ్**

125 వ వార్షిక సభ ఖాదియాన్ కొరకు 26, 27, 28 డిశంబర్ 2015 శనివారము, ఆదివారము, సోమవారమును సయ్యద్నా హజ్రత్ అమీరుల్ ముమినీన్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఆమోదించిరి. కనుక ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ శుభకరమైన సభలో పాల్గొనుటకు సంకల్పించి దుఆలతో సన్నాహాలు మొదలుపెట్టగలరు. ఈ దైవ సభతో సంపూర్ణ రీతిలో ప్రయోజనము పొందు అనుగ్రహము అల్లాహ్ తఆలా మనందరికి కల్పించుగాక! ఈ సభ శుభప్రదము, విజయవంతమగుటకు సత్య స్వభావికులు మార్గదర్శనము పొందుటకు కారణమగుటకు ప్రార్ధనలు కొనసాగించగలరు. జజాకుముల్లాహ్.

(నాజిర్ ఇస్లాహ్ వ ఇర్షాద్ మర్కజియ్య ఖాదియాన్)


జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోప్రైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

**అల్లాహ్ తాలా తమ ప్రవక్తలను జీవితము నొసంగుటకు పంపును, అనగా విశ్వాసుల ఆధ్యాత్మిక మరణము తదుపరి జీవితము నొసంగుటకు పంపునని పవిత్ర ఖురాన్ పదాలలో నుడివినట్లు తెలియును. ఈ జీవితము ఆధ్యాత్మిక జీవితమే గాని మరణపు తదుపరి జీవితము కాదు.**

అల్లాహ్ తాలా తమ ప్రవక్తలను జీవితము నొసంగుటకు పంపును, అనగా విశ్వాసుల ఆధ్యాత్మిక మరణము తదుపరి జీవితము నొసంగుటకు పంపునని పవిత్ర ఖురాన్ పదాలలో నుడివినట్లు తెలియును. ఈ జీవితము ఆధ్యాత్మిక జీవితమే గాని మరణపు తదుపరి జీవితము కాదు. విశ్వాసులు ఎల్లప్పుడు సందేశహరుని పిలుపును అనుసరించి తమను తాము సంస్కరించుకొనవలెనని దీని ద్వార స్పష్టమగుచున్నది. అల్లాహ్ ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా మన జీవిత సామాగ్రిని పొందుపరచెను. ఒక సంపూర్ణ సమగ్ర ధర్మశాస్త్రము పవిత్ర ఖురాన్ రూపములో అవతరింపజెసెను. దీనిని అమలు చేయు సమగ్ర ఆదర్శకునిగా ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహివసల్లంను నిలుపెను. సల్లల్లాహు అలైహి వసల్లంనకు సమీపములో నన్నువారు దాని అనుభూతిని పొందిరి, పొందుచుండిరి. వారికి సమీపముగానున్న వారిపై అధికముగా ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహివ సల్లం కార్యపు సౌందర్యము స్పష్టమగును. వారి భార్యామణులు వారి ఈ సత్కర్మలకు అందరికంటే ఎక్కువ సాక్షులుగా నిలిచిరి. అందుకే ప్రశ్నించు వారు హజ్రత్ ఆయెషా రజియల్లాహుతాలా అనహాతో ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గుణము లెట్టివని ప్రశ్నించినపుడు, వారి గుణములు ఖురాన్‌కు నిదర్శనమని హజ్రత్ ఆయేషా ర.అ. సమాధానమిచ్చిరి. (ముస్నద్ అహ్మద్ బిన్‌హంబల్ సంపుటి ,పుట 144 హదీస్ ఆయెషా ర.అ.హదీస్ నెం. 25108 ఆలముల్‌కుతుబ్ బేరూత్ 1998)పవిత్ర ఖురాన్ నందున్నదంతయు వారి కార్యాచరణగా నుండెను.

కావున సందేశ హరుల అస్తిత్వము ప్రపంచమునందు నిదర్శనముగా నుండును, వారి అస్తిత్వము లేదా వారి నిద్ధరనముతో ఒకడికి అఘాతము కలిగే ప్రశ్నయే జనించదు, ఈ సూక్తిలో అల్లాహ్ మరియు ప్రవక్తను ఏకము చేసి అల్లాహ్ చెప్పినదే అతని ప్రవక్త ఆచరించునని నిరూపించెను. కావున ఆధ్యాత్మిక జీవితమును పొందగోరినచో కనులు మూసి ప్రవక్తను అనుసరించుము, అతని ఆదేశములను పాటించుము, ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను గూర్చి ఇది కూడ ఇలా తెలుపబడెను. మీరు అల్లాహ్ ప్రేమను కోరినచో ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరించుట అని వార్యము, అప్పుడే ఆధ్యాత్మిక జీవనము ,ఆధ్యాత్మిక జీవితము లభించును, అల్లాహ్ ప్రేమ వలనే ఈస్థానము లభించును , కావున నిజమైన ఆధ్యాత్మిక జీవితమును పొందుటకు ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహివసల్లం ఆదేశాలను పాటించుట తప్పనిసరి.

ముస్లిం అనబడువారు యథార్థముగా అల్లాహ్‌తాలా ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహివసల్లం నోట ప్రకటింపజేసిన పదాలను **"నన్ను అనుసరించినచో అల్లాహ్ మిమ్ములను ప్రేమించును"** ను విశ్వసించినంత వరకు అతడొక్క నిజమైన అనుయాయి, విశ్వాసుడిగా గుర్తించబడదు. వారిని అనుసరించు నిదర్శనము హజ్రత్ ఆయేషా (ర.అ) నుడివినట్లు పవిత్ర ఖురాన్ రూపములో మన ముందు గలదు. ఒక జాతి శత్రుత్వము కూడా మిమ్ములను అన్యాయము చేయుటకు ఉపక్రించరాదని ఈ పవిత్ర ఖురాన్ భోధించును. కారణము లేనిదే ఒకరిని హతమార్చరాదని, పాణుల హక్కులను చెల్లించుమని పవిత్ర ఖురాన్ ఆదేశించుచున్నది. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహివసల్లం సర్వ ప్రపంచమునకు దయానుగ్రహము గలవాడని, జాతి, ధర్మ బేధము లేకుండా ప్రతిఒక్కరికి దయాళువని పవిత్ర ఖురాన్ నుడువెను, అనుగ్రహము బేధ, భావములను పాటించరాదని హెచ్చరించెను.

పవిత్ర ఖురాన్‌ను పారయణం చేసినచో అందులో అన్ని విధాల మార్గదర్శనము లభించును. నేటి కాలపు ముస్లింల తప్పుడు కార్యాచరణాలను చూచి ముస్లిమేతరులు ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహివసల్లం మరియు ఇస్లాంపై మీ ప్రవక్త, మీ ధర్మము నొసంగిన జీవితమిదేనా?, సందేశహరులైతే జీవితములు నొసంగుదురని అంటున్నారు కాని ముస్లింల కార్యాచరణములు శవముల వలెనున్నవి, మానవ జీవితములను నాశనము చేయుటలో మునిగియున్నారు, అమాయకులను, విధవలను హతమార్చు చున్నారు, అని ఆక్షేపించు వారి ఆక్షేపణలనన్నింటిని పవిత్ర ఖురాన్ రద్దు చేయును.

ఈ ఆక్షేపణలకు సమాధానము అల్లాహ్, అతని ప్రవక్త పదునాలుగు వందల సంవత్సరముల ముందు ఇస్లాం ప్రారంభములోనే పవిత్ర ఖురాన్‌లో జుమా అధ్యాయపు ఈ సూక్తులలో అనగా **నిరక్షరాసులలో వారిలో నుండే ఒక గొప్ప ప్రవక్తను నియమించెను, అతడు వారిలో ఈ సూక్తులును చదువును, వారిని పవిత్రులుగా చేయును, వారికి గ్రంధము మరియు వివేకముతో కూడిన బోధనలను భోధించును, ఇంతకు ముందు వారు నిశ్చయముగా స్పష్టమైన దుర్మార్గములో నుండిరి, మరల వారిలో నుండే ఇంత వరకు వారిని కలియని వారిలో కూడా అతనిని నియమించెను. అతడు సంపూర్ణ విజయుడు, వివేకవంతుడు.** అని తెలుపెను. నేడు ముస్లింల అమలుతో ప్రత్యక్షమగు మూఢత్వము, దుర్మార్గము ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహివసల్లం కాలమునందు కూడ ఉన్నది. దాని రూపుమాపుటకు వాస్తవ జీవితము నొసంగు సందేశము నొసంగుటకు అల్లాహ్ ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహివసల్లను పంపియుండెను. ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహివసల్లం తెచ్చిన ఈ జీవితము నొసంగు సందేశమును వ్యాపింప జేయుటకు నేడు అల్లాహ్ తాలా హజ్రత్ మసీహ్‌మౌవూద్ అలైహిస్సలాంను పంపెను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తో విధేయత ప్రమాణము చేసి అహ్మదీయ ముస్లిం జమాఅత్ ఈ సందేశమును ప్రపంచమునకు అందించుచున్నది. ఈ సందేశమును అందించు బాధ్యత కూడ అహ్మదీయులదే.

నేటి పరిస్థితులను, జనులను గూర్చి మరియు నేడు కార్యములోనరించు ధర్మపండితులను గూర్చి ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహివసల్లం వీరు ఆకాశము క్రింద అధమ ప్రాణులు, ఉపద్రవములు అల్లకల్లోలములకు వీరు కేంద్రమైయుందురు అని తెల్పిరి.

అప్పుడు అల్లాహ్ తాలా మసీహ్ మౌవూద్ అవతరించును. అతడు జీవనము నొసంగును, ఈ భవిష్యవాణి ప్రకారమే వారు (అ) నేను జీవితము నొసంగటకు వచ్చితినని వాగ్దానము చేసిరి, వారిని విశ్వసించు వారలు నూతన జీవితమును పొందినట్లు మనము తిలకించుచున్నాము. కావున జీవనమిచ్చు ప్రవక్త ఇతడేనా? అనే ఆక్షేపణకు ఆస్కారమే లేదు. ఎందుకనగా మహ ప్రవక్త (స) మరియు అల్లాహ్ తాలా ఈ పరిస్థితులను గూర్చి, ఈ సందేశము, ఈ ప్రవక్త జీవితమును ప్రసాదించును సదా ప్రళయదినము వరకుండునని ముందే తెలిపిరి, కాని ఈ సందేశమును కార్యాచరణలో పెట్టువారు, మహా ప్రవక్తను అనుసరించువారు లేకుండిరి. అందువలనే అల్లాహ్ తాలా మరల వారి సంపూర్ణ అనుసరణ విధేయనిగా మసీహ్‌మౌవూద్‌ను పంపెను.

పై సూక్తిని వివరిస్తు ఒక చోట హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు నుడివిరి. దుర్మార్గము, దౌర్జన్యము అభివృద్ధి చెందిన తరువాత

(8 వ పేజిలో చదువుము)

# జుమా ప్రసంగము

అల్లాహ్ తఆలా కృపానుసారము ఎలాంటి సంకోచము లేకుండా సంతోషముతో పిల్లలు, నవయువకులు, స్త్రీలు, పురుషులు కూడ తమను తాము సేవ కొరకు సమర్పించుకుంటున్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అతిథుల సేవ చేసే అవకాశము కల్పించి అల్లాహ్ తఆలా మమ్ము అనుగ్రహించినాడని అధిక నవయువకులు, బాలలు భావించుతారు.

అంతే గాకుండా మేము కేవలం స్వచ్ఛందముగా సేవలు అందించాము. ఇందుకై మాకు లభించే ప్రతిఫలం ప్రాపంచిక సాధనలో ఉన్న మీ లాంటి వారికి తెలియదు. మీరు అంచనా కూడ వేయలేరు. మేము కేవలం అల్లాహ్ తాలా అనుగ్రహంను పొందుటకు మాత్రమే సేవలు అందించుచున్నామని సమాదానం ఇచ్చెదరు.

కొన్ని సార్లు కొందరి ఉత్సాహము అధికముగా యుండును. కాని ప్రతి ఒక్కరి స్వభావము విభిన్నముగా యుండును. కొందరు నిరుత్సాహానికి గురవుతారు. కొందరు అవగాహన రాహిత్యం వలన అతిథులకు బాధ కలిగించే కొన్ని మాటలు మాట్లాడుతారు, లేదా కొన్ని మాటలు దొర్లుతాయి. కాని వారికి గుర్తు చేసినప్పుడు స్వచ్ఛందంగా సేవలు చేయువారు జాగరూకు లగుదురు. ప్రత్యేక శ్రద్ధతో తమ విధులను నిర్వర్తించుటకు ప్రయత్నింతురు.

నేడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దాసులు అల్లాహ్ తఆలా ఆదేశము మేరకు మనస్ఫూర్తిగా నిస్వార్థముగా, అలసిపోకుండా, నుదుట కోపము కనిపించకుండా ఆ అతిథులకు సేవలు చేయుచున్నారు. ఈ అతిథుల సేవ చేయుట, సభ ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించుటకు కృషి చేయుటనే తమ కర్తవ్యముగా భావించుచున్నారు.

నిర్వాహకులు " తమ సోదరునితో చిరునవ్వుతో మాట్లాడాలి, ఇది కూడ దానముగానే లెక్కింపబడును" అని తెలిపిన ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశమును గుర్తుంచుకోవలెను.

"పరి శుభ్రతను పాటించుట విశ్వాసంలో భాగమని", అందుకే పరిశుభ్రతను, పారిశుధ్యమును పాటించవలెనని, స్నానపు గదులను, మరుగు దొడ్లను పరి శుభ్రముగా ఉంచవలెనని పదే పదే సేవకులు అతిథులకు ప్రకటించటంలో ఎలాంటి తప్పిదము లేదు. అల్లాహ్ తఆలా ఈ సభను అన్ని విధాలా శుభప్రదము, జయప్రదము కూడ చేయుగాక! ప్రతి వ్యతిరేకి, దుస్వభావము గల వ్యక్తిచే నష్టము కలగకుండా అన్ని విధాలా రక్షించుగాక! హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సభకు వచ్చిన అతిథులకు గొప్ప రీతిలో సేవచేయు భాగ్యమును అల్లాహ్ తఆలా ప్రతి ఒక్కరిని అనుగ్రహించుగాక!

**సయ్యద్నా అమీరుల్ మొమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ. 05 ఆగస్టు 2016 ( 05 జహూర్ 1395 హి.షు) తేదీన మస్జిద్ ఫజల్, లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ ـ بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ـ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ـ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ـ

إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ـ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ـ

صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ـ

వచ్చే శుక్రవారము నుండి అహ్మదియ్య జమాఅత్ ఇంగ్లాండ్ (జల్సా సాలానా) వార్షిక సభ ప్రారంభమగుచున్నది. ఇన్ షా అల్లాహ్. అల్లాహ్ తఆలా కృపానుసారము వార్షిక సభలో పాల్గొనుటకు అతిథులు చేరుకొనుచున్నారు. ప్రపంచములోని వివిధ దేశముల నుండి లేదా ఇంగ్లాండ్‌లోని వివిధ ప్రాంతముల నుండి విచ్చేయిచున్న అతిథులకు సరియైన రీతిలో సేవలందించు అనుగ్రహము అల్లాహ్ తఆలా వార్షిక సభ నిర్వాహకులకు కలిగించుగాక!

అల్లాహ్ తఆలా కృపానుసారము సభకు వచ్చే అతిథుల సేవ కొరకు ఇంగ్లాండ్ నలు వైపుల నుండి వృద్ధులు, నవయువకులు, బాలలు, స్త్రీలు తమను తాము స్వచ్ఛందంగా సేవకు సమర్పించుకుంటారు. పాల్గొనే వారి సంఖ్య పెరిగిన కొద్ది సభ ఏర్పాట్లు అధికమగుచున్నవి, సేవకులుకూడ అధిక సంఖ్యలో అవసరముందురు. అల్లాహ్ తఆలా కృపానుసారము ఎలాంటి సంకోచము లేకుండా సంతోషముతో పిల్లలు, నవయువకులు, స్త్రీలు, పురుషులు కూడ తమను తాము సేవ కొరకు సమర్పించుకుంటున్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అతిథుల సేవ చేసే అవకాశము కల్పించి అల్లాహ్ తఆలా మమ్ము అనుగ్రహించినాడని అధిక నవయువకులు, బాలలు భావించుతారు. అల్లాహ్ తఆలా కృపానుసారము జల్సా సాలానా అతిథుల సేవ చేయాలని జమాఅత్‌లోని ప్రతి శ్రేణి, ప్రతి వయసులోని వ్యక్తులలో ప్రతి దేశములో ఒక స్ఫూర్తి ఏర్పడినది.

గత వారపు శుక్రవారం నుండి ఆదివారం వరకు అమెరికాలో వార్షిక సభ నిర్వహించడం జరిగినది. ఆ జల్సా కార్యక్రమాలు ఇంటర్నెట్ మరియు యూటూబ్‌లో కూడ ప్రసారం చేయబడినవి. ఈ సందర్భంగా నేను కూడ ఒక ఇంటర్వ్యూను చూసినాను. ఇంటర్వ్యూ తీసుకునేవారు ఖుద్దాముల్ అహ్మదియ్య పదవి దారులతో ఇంటర్వ్యూ తీసుకోవడం జరిగినది. జల్సా సాలాన ఏర్పాట్ల కొరకు యువకులు, స్వచ్ఛంద సేవకులు ఏ విధముగా శ్రమించారనే విషయంను వారు వారికి తెలుపుచున్నారు. ఆ కార్యక్రమములో భాగంగానే అక్కడే పుట్టి, పెరిగిన 19 లేదా 20 సంవత్సరాల ఒక యువకుడితో కూడ ఇంటర్వ్యూ తీసుకొనెను. ఈ పని చేసినందుకు మీకు ఎంత మూల్యం చెల్లించారు?. ఎన్ని డాలర్లు చెల్లించారు?. ఇందుకు ప్రతిఫలంగా ఏమి లభించినది? అని ఆ యువకుడిని ప్రశ్నించగా, సాధారణంగా ఈ ప్రశ్నను చాలా మందిని అడిగిరి. ప్రపంచ సాధనయే లక్ష్యముగా ఉన్న వాతవరణమైన అమెరికాలో పుట్టి, పెరిగిన ఆ యువకుడు, మేము కేవలం స్వచ్ఛందముగా సేవలు అందించాము. ఇందుకై మాకు లభించే ప్రతిఫలం ప్రాపంచిక సాధనలో ఉన్న మీ లాంటి వారికి తెలియదు. మీరు అంచనా కూడ వేయలేరు. మేము కేవలం అల్లాహ్ తాలా అనుగ్రహంను పొందుటకు మాత్రమే సేవలు అందించుచున్నామని సమాదానం ఇచ్చెను. అల్లాహ్ తాలా కృపానుసారంగా ప్రపంచ నలుమూలలో ఉన్న అహ్మదీయులందరిలో ఈ స్ఫూర్తియే గలదు. వారు ఆఫ్రికా వాసులైనా లేదా ఇండోనేషియన్ అయినా, దీవుల నివాసులైనా లేదా అభివృద్ధి చెందిన పశ్చిమ దేశముల నివాసులైనా ప్రపంచములోని ప్రతి దేశములో యుంటున్న అహ్మదీయునిలో ఈ స్ఫూర్తి గలదు. పాఠశాలలు, కళాశాలలో సెలవులు వచ్చినప్పుడు ప్రపంచీకులు ప్రపంచ ప్రాధాన్యతల దృష్ట్యా ఆటలు ఆడుటకు, పాటలు పాడుటకు, విహారాలకు వెళ్ళాలని కోరుకుందురు. అదే విధముగా ప్రాపంచిక ఉద్యోగములలో సెలవులు లభించినప్పుడు విశ్రాంతి తీసుకొనుటకు, కుటుంబముతో సెలవులు గడుపుటకు ప్రాధాన్యతలను ఇచ్చెదరు. కాని ఆయా సమయములలో ఒక అహ్మదీయుని ప్రాధాన్యతలు భిన్నముగా యుండును. ఈ సెలవులలో వార్షిక

సభకు వచ్చుచున్నచో విద్యావంతులు, నిరక్షరాస్యులు, అధికారులు, క్రింది సిబ్బంది, వృత్తిపరమైన నిపుణులు, సాధారణ కూలీలు, విద్యార్థులు కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అతిథుల సేవ కొరకు తమను తాము స్వచ్ఛందంగా సమర్పించుకొందురు.

అభివృద్ధి చెందిన దేశాలలో, ఇతర ప్రపంచ దేశాలలో పెద్ద పెద్ద ప్రాంగణాలలో వార్షిక సభలు నిర్వహించబడుతాయి. అచట అన్ని రకాల వసతులు ముందు నుండే ఏర్పాటు చేయబడి యుండును. కాని ఇంగ్లాండ్ జల్సా వసతులను మాత్రం అందుకు భిన్నంగా కేవలం తాత్కలికంగా ఏర్పాటు చేసి, సాధ్యమైనంత వరకు అన్ని రకాల వసతులను కల్పించుటకు ప్రయత్నించడం జరుగుతుంది. అంతేగాకా జల్సా ప్రారంభము నుండి జల్సా ముగిసిన పిదప ఆ నేలను మరల వ్యవసాయమునకు అనుకూలంగా ఒక నిర్ధిష్ఠ సమయంలో మార్చాలని కౌన్సిలర్ నుండి నిబంధన కూడ ఉంటుంది. ఈ పనులన్ని కేవలం 28 రోజులలోనే ముగించాలి. అందువలన తక్కువ సమయంలో ఇంత భారిగా ఏర్పాట్లను పూర్తి చేయుటకు అధిక సంఖ్యలో యువతి యువకులకు స్వచ్ఛందగా సేవలు అందించవలసి ఉంటుంది. పనిని ప్రారంభించి, ముగించుట వరకు నిర్దేశించిన సమయం పనుల ప్రకారంగా తక్కువగా ఉన్నప్పటికి, స్వచ్ఛంద సేవలకులు అధిక సంఖ్యలో పాల్గొని ఆయా కార్య క్రమాలను పూర్తి చేయడం జరుగుతుంది. మరి కొన్ని కార్య క్రమాలు నిర్దేశించిన సమయానికి 2 లేదా 3 వారాల ముందు నుండే ప్రారంభించ వలసి యుంటుంది. అవి జల్సా వేదికకు సంబంధించినవి కావు. మొత్తానికి ఇక్కడి సేవకులలో కొందరు మాత్రం సమయం వెచ్చించుటలో, ధనంను ఖర్చు చేయుటలో సుమారుగా 2 మాసాల వరకు త్యాగాలు చేయవలసి ఉంటుంది. ఒక వ్యక్తి స్వచ్ఛందగా సేవ చేయుటకు ఈ సమయం చాలా అధిక సమయమవుతుంది. ఈ విధముగా చూసినచో ఇంగ్లాండ్ యువతి, యువకులకు ఇంగ్లాండ్ జల్సా ప్రాధాన్యత, సేవల ఆవశ్యకతలు తెలుసునని అర్ధమవుచున్నది. సంవత్సరాలుగా ఈ సేవలు ఇక్కడి వారు అందిస్తున్నారు. అయిన కూడ ప్రతి సంవత్సరము కొందరు యువతి, యువకులు ఈ స్వచ్ఛంద సేవలో నూతనంగా ప్రవేశం పొందెదరు. కొందరు ప్రత్యక్ష్యముగా జల్సా రోజులలో అతిథులతో ఆత్మియ బంధాలను పెనవేసు కొంటారు. మరి కొందరు పరోక్ష్యంగా బంధాలను ఎర్పర్చుకుంటారు. కొందరి డ్యూటి అతిథుల రాక వలన నేటి నుండి ప్రారంభము కాగా, మరి కొందరి డ్యూటి జల్సా రోజులలో ప్రారంభమగును. కాని కొందరి డ్యూటి చాలా రోజుల క్రితమే ప్రారంభమైనది. కావున వారందరికి వారి వారి బాధ్యతలను గూర్చి గుర్తుచేయుదును.

కొన్ని సార్లు కొందరి ఉత్సాహము అధికముగా యుండును. కాని ప్రతి ఒక్కరి స్వభావము విభిన్నముగా యుండును. కొందరు నిరుత్సాహనికి గురవుతారు. కొందరు అవగాహన రాహిత్యం వలన అతిథులకు బాధ కలిగించే కొన్ని మాటలు మాట్లాడుతారు, లేదా కొన్ని మాటలు దొర్లుతాయి. కాని వారికి గుర్తు చేసినప్పుడు స్వచ్ఛందంగా సేవలు చేయువారు జాగరూకు లగుదురు. ప్రత్యేక శ్రద్ధతో తమ విధులను నిర్వర్తించుటకు ప్రయత్నింతురు. అంతేగాని సేవకులు సరిగాసేవలు చేయరనే భావనతో నేను మీకు గుర్తు చేయడంలేదు. వాస్తవానికి ఈ యువకులందరు చాలా ఉత్సాహంతో సేవలు చేయుదురు. గుర్తు చేయుము, జాగ్రత్త పరచుమని అల్లాహ్ తఆలా ఆదేశించడం జరిగినది. అందుకే నేను ప్రతి సంవత్సరం సభ కంటే ఒక శు క్రవారము ముందు ఈ అంశాల వైపు సూచించడం జరుగుతుంది. పవిత్ర ఖుర్ఆన్‌లో కూడ అల్లాహ్ తఆలా అతిథుల ప్రస్థావనలో హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలాం ఆతిథ్యమును ప్రస్తావించుచు ఆతిథ్య ప్రాముఖ్యతను తెలిపెను. ఆఁ హజ్రత్ సల్లల్లాహు అలైహి వలసల్లం కూడ వివిధ సందర్భములలో ఆతిథ్య ప్రాముఖ్యతను, ఈ లక్షణమును ప్రస్తావించినారు. ఈ కాలములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనకు ఇటు వైపు ప్రత్యేక దృష్టి కలిగించినారు. ఇంతే కాక తన అవతరణ ఉద్ధేశములలో ఈ ఉద్ధేశమొకటని అనగా ధార్మిక ప్రయాణము చేయుచు వచ్చే అతిథుల కొరకు ఆతిథ్యమిచ్చుటని వారు పేర్కొన్నారు. ఈ విషయమును గూర్చి వారు (అ)ఒక చోట ఇట్లు ప్రస్తావించిరి. ..

"ఈ వ్యవస్థ మూడవ శాఖ అనగా ధార్మికులు, పుణ్యాత్ములు సత్య అన్వేషణ కోసం ప్రయాణం చేయువారు లేదా ఇతర అవసరాల కోసం వచ్చువారిగా పెర్కొన వచ్చును." మరల ఇట్లనిరి "ఈ శాఖ కూడ క్రమ క్రమంగా పెరుగుచున్నది" (ఫతహ్ ఇస్లాం, రుహాని ఖజాయిన్ సంపుటి3, పుట 14). అనగా పెరుగుచున్నారు. మరల వారు ఇట్లనిరి: వేల సంఖ్యలో వీరు పెరుగుచున్నారు. ఖాదియాన్ వంటి ఒక చిన్న గ్రామములో ఆ కాలంలో ( సేకరణ ఫతహ్ ఇస్లాం, రుహాని ఖజాయిన్ సంపుటి3, పుట 14) ఎలాంటి సౌకర్యములు లేకున్నను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బటాల నుండి లేదా అమృతసర్ నుండి అతిథుల సేవకై సరుకులు తెప్పించేవారు. ఇలాంటి సందర్భాలలో రవాణ సౌకర్యములు లేనందున వారు ఇబ్బందులను కూడ ఎదుర్కొనిరి. కొన్ని సందర్భాలలో కాలి నడకనే వెళ్ళవలసి వచ్చేది. సాధరణంగా గుర్రపు బండ్లపై, ఎక్కాలపై ప్రయాణించేవారు. ఇలాంటి పరిస్థితులలో సుదూర ప్రాంతాల నుండి వచ్చిన అతిథులకు సేవలు చేయడంలో కొన్ని సమస్యలు ఎదురయ్యేవి. అందువలనే అల్లాహ్ తాలా వారి (అ) హృదయాన్ని పటిష్ఠం చేసుకొమ్మని ముందు నుండే ఆదేశించడమైనది. ఇందుకై వారి(అ) పై ఒక అరబి దైవవాణి కూడ అవతరించినది. దాని అర్ధం "ప్రజలు అధిక సంఖ్యలో నీ వైపు ప్రయాణించెదరు, కావున నీవు వారితో దుష్ప్రవర్తనను ప్రదర్శించ రాదు. వారి అధిక సంఖ్యను చూసి నీవు అలసిపోకూడదు".

(సేకరణ: లెక్చర్ సియాల్కొట్, రూహాని ఖజాయిన్ సంపుటి 20, పుట 242)

నేడు ప్రపంచములోని నలు వైపులలో సభల నిర్వహణ ఈ దృశ్యమును చూపును. అనగా ప్రజలు అధికంగా వస్తారు, ఇహ, పరలోక శుభములను పొందుతారు. ఇక్కడ వర్తమాన ఖలీఫా యున్నందున ధార్మిక విద్య పొందుటకు, ఆధ్యాత్మిక దాహము తీర్చుకొనుటకు ప్రపంచ నలు మూలల నుండి ఇంగ్లాండ్‌కు అతిథులు వస్తారు.

నేడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దాసులు అల్లాహ్ తఆలా ఆదేశము మేరకు మనస్ఫూర్తిగా నిస్వార్ధముగా, అలసిపోకుండా, నుదుట కోపము కనిపించకుండా ఆ అతిథులకు సేవలు చేయుచున్నారు. ఈ అతిథుల సేవ చేయుట, సభ ఏర్పాట్లను సమర్ధవంతంగా నిర్వహించుటకు కృషి చేయుటనే తమ కర్తవ్యముగా భావించుచున్నారు.

సభలో అహ్మదియేతరులు, ముస్లిమేతరులు కూడ వస్తారు. చిన్న చిన్న పిల్లలు ఎలా తమ బాధ్యతలను నిర్వర్తించుచున్నారు, తమకు అప్పగించబడిన కార్యమును చేయుచున్నారని, ఎంతో బాధ్యతతో నిర్వహించుచున్నారని సేవకుల పనితో వారు సదా ఆశ్చర్యానికి గురవుతారు.

గత సంవత్సరం ఒక అతిథి యుగాండా నుండి వచ్చిరి. వారు అక్కడి మంత్రివర్యులు, నేనిక్కడి ఆతిథ్యము, ఏర్పాట్లను చూచి స్వచ్ఛందంగా ఎలా ప్రజలు ఇన్ని త్యాగములు సమర్పించుచున్నారని ఆశ్చర్యానికి లోనైతినని వారు తెల్పిరి. మానవులు కాకుండా దేవదూతలు పనులు చేయుచున్న సభలో పాల్గొనుటకు పోవుచున్నాని నేను ఏ మాత్రం ఊహించలేదు. ఇంకను ఇట్లనిరి. ఇరువది సార్లు కూడ ఏదైనా వస్తువు అడిగినచో చిరునవ్వుతో అందిస్తారు. పిల్లలు భోజనము వడ్డించునప్పుడు ఎంతో సంతోషముతో అందించు విషయమును కూడ వ్యక్తపరిచిరి. సభా ప్రాంగణములో మంచి నీళ్ల త్రాగించేవారు కూడ ఎంతో ఆనందముతో అందిస్తారు. పదే పదే వస్తువు అడిగినను, మంచి నీళ్లు అడిగినను అందిస్తారు. ఇది ప్రత్యేక అతిథులకు మాత్రమే కాదు, ప్రతి ఒక్కరికి ఈ సదుపాయము గలదు. ఈ సేవా గుణమే అహ్మదియ్య జమాఅత్ ప్రతి సభ్యుని ప్రత్యేకత అయినది, కావలెను. ఏ

విభాగములో పని చేయుచున్నను ఈ ప్రత్యేక లక్షణమును ప్రతి ఒక్కరు సదా కొనసాగించవలెను.

మన సభకు అతిథులు వచ్చినప్పుడు వారికి వివిధ విభాగాలతో అవసరము ఏర్పడును. వారు రావడంతోనే వారిని అహ్వానించే శాఖతో వారికి సంబంధము ఏర్పడుతుంది. అహ్వాన శాఖ వారు అతిథులను సాదరంగా ఆహ్వానించును. ప్రయాణం చేసి వచ్చినప్పుడు అతిథులకు అలసట కల్గుతుంది. ప్రయాణంలో ఎన్ని విధాలుగా సౌకర్యములను కల్పించినను ప్రయాణికులకు అలసట, విసుగు ఉంటుంది. అందువలనే ఆహ్వాన శాఖవారు ఈ విషయాలను శ్రద్ధగా గమనించవలెను.

విమానాశ్రయంలో కూడ ఆహ్వాన శాఖ వారు తమ బాధ్యతలను నిర్వహిస్తుంటారు. సాధారణంగా చాలా ఉత్తమ సేవలను అందిస్తుంటారు. కాని సమీప ప్రాంతాల నుండి వచ్చే అతిథులు వారి వారి కార్లలో వచ్చెదరు. లేదా కొన్ని గంటలు బస్సులో ప్రయాణం చేసి ఇక్కడికి చేరుకుంటారు. తొందరగా అలసట చెందుతుంటారు. కావున వచ్చిన వారు వారికి నిర్దేశించిన జమాఅత్ స్థావరలలో బస చేయుచున్నచో అచటి నిర్వాహకులు " తమ సోదరునితో చిరునవ్వుతో మాట్లాడాలి, ఇది కూడ దానముగానే లెక్కింపబడును" అని తెలిపిన ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశమును గుర్తుంచుకోవలెను. (సునన్ తిర్మిజి, అబువాబుల్ బిర్రు వస్సాలాత్, బాబ్ మా జా ఆ ఫి తాలకతిల్ వజ ...హదీస్ సంఖ్య 1970). మరల ఒక సందర్భమున వారు (స) ఇట్లు తెల్పిరి: "సాధారణ పుణ్యమును కూడ తక్కువగా భావించకూడదు, తన సోదరునితో చిరునవ్వుతో వ్యవహరించుట కూడ పుణ్యము". (సహీ ముస్లిం, కితాబుల్ బిర్రు వస్సాలాత్, బాబ్ ఇస్తజాబ్ తాలకతిల్ వజ ...హదీస్ సంఖ్య 2626). ఇస్లాం బోధన ఎంత అందమైనదో చూడగలరు. అతిథుల మర్యాదను గూర్చి చాలా శ్రద్ధ చూపించడమైనది. ఈ లక్షణము పుణ్యమును చేకూర్చు లక్షణము. మరల అతిథులకు సేవలు చేయడంతో పాటు వారితో చిరునవ్వుతో మాట్లాడడం కూడ పుణ్య ఫలమైనచో ఇలా రెట్టింపు ఫలములను మనకు ఏర్పాటు చేయడమైనది. ఒకటి అతిథి మర్యాదల వలన లభించునది. మరొకటి ఉత్తమ లక్షణాలను ప్రదర్శించుట వలన దాన రూపంలో లభించునది. ప్రేమతో మాట్లాడడం, ఉత్తమ లక్షణాలను కనబర్చడం కూడ పుణ్యఫలముగా లెక్కింపబడును. ఈ పుణ్యఫలములకు ఎంత ప్రతిఫలం ఇవ్వవలెను అనునది అల్లాహ్ తాలా చేతిలో గలదు.

దారి చూపుట కూడ ఒక దానమని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపిరి. (సహి బుఖారి, కితాబుల్ జిహాద్, వల్ యసీర్, బాబ్ ఫజల్ మిన్ హమల్ మతా ..హదీస్ సంఖ్య 2891). ప్రయాణము చేసి వచ్చిన ప్రయాణికునితో సత్ప్రవర్తనతో వ్యవహరించాలని, అనంతరం సహాయకులతో ప్రత్యేకంగా స్త్రీలు, పిల్లలు యున్నప్పుడు అనగా స్త్రీలు వారి భర్తలతో కాకుండా వారి పిల్లలతో వచ్చినప్పుడు వారిని వారి నివాస స్థలము వరకు చేర్చాలని ఈ విభాగానికి నియమితులైన వారు గుర్తుంచుకోవలెను. ఇది చాలా ముఖ్యమైన బాధ్యత అని ఈ శాఖకు నియమితులైన వారు గుర్తుంచుకోవలెను. చాలా సందర్భాలలో వారి సామాన్లను తెచ్చుటకు సహాయకుల అవసరమొచ్చును. అదే విధముగా కేవలం నవ్వుచు, ఉత్తమ లక్షణాలను ప్రదర్శించు బాధ్యత కేవలం ఆహ్వాన శాఖ వారిదే కాకుండా అన్ని శాఖల వారిది.

నేటి పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్కరు జమాఅత్ రిజిస్టర్ కార్డును తమ వెంట తీసుకరాగలరు. బయటి నుండి వచ్చేవారు తమ పరిచయ పత్రమును తప్పకుండా తీసుకరాగలరు. అప్పుడే మీకు జల్సా సాలాన కార్డులు జారి చేయబడును. కొన్ని సందర్భాలలో రూఢికరించిన పత్రము లేకుండ వస్తుంటారు. అలాంటి స్థితులలో తప్పకుండా రూఢికరించు ఏదేని ఆధారం కావలెను. లేనిచో వారికి కార్డు జారి చేయబడదు. కాని వారు తెచ్చిన పత్రం రూఢికరన పొంది కార్డు జారి చేయు సమయం వరకు నిర్వాహకులు అతిథులతో ఉత్తమ లక్షణాలను కనబర్చవలెను. అందుకొరకు వారు వేచి యుండుటకు తగిన ఏర్పాటు చేయవలెను. ఇది చాలా ముఖ్యం. కొన్ని సందర్భాలలో చిన్న పిల్లలు గల తల్లులు కూడ చాలా సమయం వరకు వేచి ఉండవలసి వచ్చును.

ప్రథమముగా వచ్చె అతిథులు కూడ తమ వెంట జమాఅతి కార్డును తప్పకుండా వెంట తీసుకొని రాగలరు. లేదా ప్రాంతీయ అధ్యక్షుల వారితో రూఢీకరణ పత్రమును తప్పక తీసుక రాగలరు. ఒకవేళ ఇందులో ఏ ఒక్కటి లేకున్నను సంబంధిత శాఖ నుండి దృవీకరణ పత్రం వచ్చు వరకు వారు వేచి ఉండుటకు తగిన ఏర్పాట్లు చేయవలెను.

అనంతరం భోజనము తినిపించే ఆతిథ్య విషయము గలదు. జమాఅత్ ఏర్పాటు చేసిన స్థావరాలలో ఉన్న అతిథులకు రెండు వేళలా లేదా మూడు వేళలా వారికి భోజన ఏర్పాట్లు చేయవలెను. కాని జల్సా మూడు రోజులలో జల్సా ప్రాంగణంలోకి వచ్చి జల్సా వింటున్న అతిథులందరికి మధ్యాన భోజనంను జమాఅత్ పరంగా తప్పక ఏర్పాటు చేయాలి. ఇందులో భోజనము వడ్డించు అధికారులు, సహాయకులు సత్ప్రవర్తనతో వ్యవహరించవలెనని గుర్తుంచుకోవలెను. సత్ప్రవర్తనతో వ్యవహరించుట అతిథుని హక్కు, ఆతిథ్యమిచ్చు వ్యక్తి కర్తవ్యము. కొందరు భోజన విషయంలో సేవకులను ఇబ్బందులకు గురి చేయుదురు. అనేక ప్రశ్నలు వేయుదురు. ఇది కావాలి, అది కావాలి అని ఏవేవో తీసుక రమ్మంటారు. అలాంటి పరిస్థితులలో సేవకులు సహనం పాటించాలి. ఆతిథ్య అంశంఎంత సున్నితంగా ఉండుననగా భోజనము తినిపించే వ్యక్తి ఒక చిన్న మాట అన్నా లేదా కొద్దిగా అమర్యాదగా వ్యవహరించినా లేదా అనవసరముగా అభిప్రాయమును వ్యక్తపరచినా అతిథుని భావాలు గాయపడును. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులు సదా స్వర్ణాక్షరాలతో వ్రాయబడు విధముగా ఆతిథ్యపు ఉదాహరణలను నెలకొల్పిరి. ఒక అనుచరునికి ఒక అతిథిని అప్పగిస్తు అతని భోజన ఏర్పాట్లు చూడమని ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించినప్పుడు, వారి (స) ఆదేశానుసారం ఆ అతిథిని తమ గృహమునకు తీసుకవెళ్ళగా భోజనం కేవలం పిల్లలకు సరిపడునంతయే ఉన్నదని ఆ అనుచరుని భార్య సమాధానం ఇచ్చినది. అప్పుడు ఆ భార్య భర్తలు ఇరువురు ముందుగా పిల్లలను ఏదో విధముగా నిద్రపుచ్చి, ఆ తరువాత అతిథి భుజించుటకు కూర్చొన్న పిదప దీపం వెలుగును పెంచుతున్నట్లుగా ప్రయత్నిస్తు ఆ దీపంను ఆర్పివేయుము. ఆ చికటిలో మనము ఆ అతిథితో భోజనం చేస్తున్నట్లుగా నటించవలెను తద్వారా ఆ అతిథి మనము భోజనం చేయడం లేదని కలత చెందకుండా మనం భోజనం చేస్తున్నట్లు భావించును. అని సర్దిచెప్పుకొనిరి. మొత్తానికి వారు తమ ఆలోచన ప్రకారం నడుచుకొనిరి. అతిథికి కూడ ఆ విషయం తెలియకుండెను. ఈ విధముగా వారు తమ అతిథ్య బాధ్యతను నెరవేర్చిరి. ఉదయం ఆ అనుచరుడు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి సన్నిదిలో ఉపస్థితి కాగా రాత్రి నీవు అనుసరించిన విధానము వలన అల్లాహ్ తాలా కూడ నవ్వుకొనెను అని హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆ అనుచరునికి తెలుపెను. (సహీ బుఖారి, కితాబుల్ మనాకిబుల్ అన్సార్, బాబ్ కౌలు ల్లాహ్ తాలా అజ్జవ జల్ హదీస్ సంఖ్య 3798) ఈ త్యాగాన్ని వారు ఎందుకు చేసారనగా ఆ అతిథి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి అతిథి. సాధారణంగా అనుచరులు అతిథులకు మర్యాదలు చేస్తుండేవారు. కాని ఈ అతిథి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి అతిథి అయినందున వారిపట్ల ఇంతగా ప్రత్యేక శ్రద్ధను తీసుకోవడం జరిగినది.

నేడు కూడ మన సేవకులు ఈ అతిథులను ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ప్రియమైన శిష్యుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారి అతిథులుగా భావించి ఈ విధమైన త్యాగాలను చేయవలెయును. తమ

ఆకలిని చంపుకొని, తమ పిల్లల ఆకలిని చంపుకొని తమ ఆహారమును వచ్చిన అతిథులకు వడ్డించడను చాలా గొప్ప త్యాగంగా చెప్పుకోవచ్చును. నేటి కాలంలో ఇలాంటి త్యాగాలు చేయవలసిన అవసరం ఏమియు లేదు. అల్లాహ్ తఆలా కృపానుసారము హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో గల అల్లాహ్ తఆలా వాగ్దానముల ప్రకారము ప్రపంచములో ఎక్కడైతే గట్టి పునాదులపై జమాఅత్ ఏర్పడినదో అక్కడ ఇప్పుడు ప్రతి చోట సత్రములు (లంగర్) కొనసాగుచున్నవి. ప్రత్యేకంగా సభ రోజులలో ఇందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయబడును. మనము సత్రము నుండి భోజనము తీసుకొని అతిథుల ముందు పెట్టు సేవ మాత్రమే చేయవలసి యుండును. అతిథులతో సత్ప్రవర్తనతో వ్యవహరించవలెను. ఈ సభకు వచ్చే, ధర్మము కొరకు ప్రయాణము చేయు అతిథుల సేవ చేసినందుకు అల్లాహ్ తఆలా ఆనందపడును. సరియైన రీతిలో ఆతిథ్యమివ్వనిచో అల్లాహ్ తఆలా ద్వారా అసంతృప్తి కూడ వ్యక్తమగును.

ఒక సందర్భమున అతిథులతో అసాధారణముగా వ్యవహరించబడెను. మరి కొందరు అతిథుల పట్ల నిర్లక్ష్యముతో వ్యవహరించబడెను. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హయంలో యున్న ఆతిథ్య సిబ్బంది ఇదంతయు చేసినారు. రాత్రి దర్శన నిమిత్తం సేవ చేసి, కొందరి అతిథులతో అమర్యాదగా వ్యవహరించబడెను. కొందరు పేదలు భోజనము చేయలేక పోయిరను విషయమును అల్లాహ్ తఆలా హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు తెలిపెను. ఈ విషయముపై హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చాలా అసంతృప్తిని వ్యక్త పర్చుతు, అనంతరం ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించడం ప్రారంభించిరి. ఆ సిబ్బందిని ఆరు నెలల కొరకు ఖాదియాన్ నుండి బహిష్కరించినారని కూడ ఒక కథనము ద్వారా తెలియుచున్నది. ( తజ్కిరా, పుట 689 ఎడిషన్ 4, ప్రచురణ 2004) కావున సేవ కొరకు మనము తమను తాము సమర్పించినప్పుడు భేదాలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరికి సేవ చేయవలెను. జల్సాకు వచ్చే ప్రతి అతిథి జల్సా అతిథుడే. ప్రతి ఒక్కరితో మంచిగా వ్యవహరించుట, ప్రతి ఒక్కరితో సత్ప్రవర్తనతో వ్యవహరించుట అనివార్యము. ఫలానా ధనికుడు, ఫలానా ప్రత్యేక అతిథి ఫలానాకు ఫలానా చోట వడ్డించాలి, ఫలానాకు ఫలానా చోట వడ్డించకూడదను విషయము సమంజసము కాదు. భోజనం వడ్డించే ఏర్పాట్లు ఉన్నచోట్లలో తప్పకుండా అందరికి కలిపి వడ్డించాలి. కాని సాధారణంగా అహ్మదీయులందరు ఒకే చోట భోజనం ఆరగించాలి. కొన్ని చోట్ల కొందరికి ప్రత్యేక ఏర్పాట్లు చేయబడును. అనగా అహ్మదీయేతరులు, ముస్లిమేతరులకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయడమైనది. ఆయా చోట్లలో కేవలం వారిని తీసుకవెళ్ళవలెను. ఈ విషయాన్ని కూడ నిర్వాకులు గుర్తుంచుకోవలెను. కొందరు సేవకులు తమ మిత్రులను లేదా బంధువులను ఆయా ప్రాంతాలలో భోజనానికి తీసుక వెళ్ళుచున్నారనే విషయం నాదృష్టికి వచ్చినది. అది కేవలం ఇతరుల కొరకు ఏర్పాటు చేయబడిన భోజనశాల. అందువలనే పదవి దారులైనను, సాధారణ అహ్మదీయులైను వారందరు సాధారణంగా వారి కొరకు ఏర్పాట్లు చేసిన భోజనశాలలోనే భోజనంను ఆరగించవలెను.

దీనితో పాటు ఇట్లు దుఆ కూడ చేయవలెను. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అతిథుల సేవ చేయుచున్న ఈ చిన్నపాటి సేవను అల్లాహ్ తఆలా ఆమోదించుగాక! మా ప్రతి పని దర్శన నిమిత్తం కాకుండా కేవలం అల్లాహ్ కొరకే అగుగాక!

హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హయాంలో ఒక్కో సారి ఎంత అధిక సంఖ్యలో అతిథులు వచ్చేవారనగా ఖాదియాన్ చిన్న ప్రాంతమైనందున నివాస ఏర్పాట్లు చేయుటకు ఇబ్బంది కలిగేది. కాని కలత చెందకూడదు, అలసి పోకూడదను అల్లాహ్ తఆలా ఆదేశము వలన హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అతిథుల కొరకు సాధ్యమయ్యే ప్రతి వసతిని ఏర్పాటు చేసేవారు. శీతాకాలంలో కొన్ని సందర్భాలలో అతిథులు అధికమైనందున తమ పిల్లల వేడి దుప్పట్లను అతిథులకు వారు ఇచ్చివేసిరి. (సేకరణ: సీరతుల్ మహ్ది , సంపుటి2, భాగం 4, పుట 91-92, ఉల్లేఖన సంఖ్య 1118) ఒక సారి ఎంత ఎక్కువ సంఖ్యలో అతిథులు వచ్చిరనగా హ్రజత్ అమ్మాజాన్ ఉమ్ముల్ మూమినీన్ ఇంత మంది అతిథులు ఎక్కడ బస చేయగలరు, వారికి తగిన ఏర్పాట్లు ఎలా అగునని కలత చెందిరి. వారి కలతను చూసి హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక కథను వినిపించిరి: ఒక బాటసారి అడవిలో ప్రయాణిస్తుండగా రాత్రి కమ్ముకొచ్చినది. అతను విశ్రాంతి తీసుకొనుటకు సమీపంలో ఏ గ్రామము లేదు, ఏ పట్టణం లేదు, ఏలాంటి నివాస స్థలం లేదు. చివరికి అతడు ఒక చెట్టు క్రింద నిద్రించ సాగెను. ఆ చెట్టు కొమ్మలపై పక్షుల గూడు ఒకటి ఉండెను. ఆ గూటిలో ఒక జంట పక్షులు ఉండేవి, ఈ చెట్టు క్రింద పడుకున్న వ్యక్తి ఈ రోజు మన అతిథి, కావున మనము అతనికి అతిథి మర్యాదలు చేయాలని ఆ జంట పక్షులు భావించినవి. వారు అతిథి మర్యాదలను ఏ విధముగా చేసిరో ఒక్క సారి వినండి. ఈ రోజు చలి అధికంగా ఉన్నది కావున ముందుగా మన అతిథికి చలి కాపు కొనుటకు ఏదైన ఏర్పాటు చేయాలని ఆ జంట నిశ్చయించుకున్నది. కాని తమ వద్ద ఏమి లేదని గ్రహించి ఏమి చేయాలో తెలియక తమ గూటినే క్రింద పడవేసినవి. దాంతో ఆ అతిథి ఆ గూటిలో ఉన్న గడ్డి పోసలతో పాటు చిన్న చిన్న కర్రలను ప్రోగు చేసి మంటను రాజేసి చలి కాపుకోవడం ప్రారంభించెను. ఆ తరువాత తమ అతిథికి భుజించుటకు ఏదైన అహారాన్ని ఏర్పాటు చేయాలి కాని మన వద్ద ఏమి లేనందున మనమే ఆ మంటలో పడిపోయినచో ఆ అతిథి మనలను కాపుకొని తిని తన ఆకలిని తీర్చుకొనునని భావించి ఆ జంట పక్షులు రెండు మంటలో దూకినవి. (సేకరణ: సిరాత్ హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఉల్లేకులు హ్రజత్ షేక్ యాకూబ్ అలి ఇర్ఫాన్ గారు పుట 130-131) అనగా హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ కథను వినుపించుటలో గల ఉద్దేశము ఏమనగా అతిథులు వచ్చినప్పుడు ఆవేదన చెందుటకు బదులు, సాధ్యామైనంత వరకు వారికి సౌకర్యములు చేకూర్చి వారిని గౌరవించవలెనని ఈ కథ అర్థం.

మనందరికి ఇందులో గుణపాఠం గలదు. ప్రత్యేకించి ఆతిథ్య భాధ్యతలను నెరవేర్చుటకు తమను తాము అంకితము చేసుకున్నవారు, తమపై గల బాధ్యతలను పూర్తిగా చెల్లించుటకు ప్రయత్నించవలెను.

విధి నిర్వాహణలో అనేక విధులు, అనేక శాఖలు గలవు. ఉదా॥

**ఇహపరలోకములో క్షేమమును యాచించు దుఆ**

హ్రజత్ మూసా అలైహిస్సలాం తమ జాతి కొరకు ఈ దుఆ చేసిరి.

وَاكْتُبْ لَنَا فِي هٰذِهِ الدُّنْيَا حَسَنَةً وَّفِي الْآخِرَةِ إِنَّا هُدْنَا إِلَيْكَ

మా కొరకు ప్రపంచములో కూడ, పరలోకములో కూడ పుణ్యమును వ్రాయుము. నిశ్చయముగా మేము నీ వద్దకు (క్షమాపణ కోరుచు) వచ్చిన వారము.

(అల్ ఆరాఫ్:157)

దుఆలు కోరుచు: సేఠ్ ముహమ్మద్ బషీరుద్దీన్ జమాఅత్ మాజీ రాష్ట్రాధ్యక్షులు ఆం.ప్ర.
మరియు కుటుంబీకులు: హైద్రాబాదాద్

ప్రొ॥ ముహమ్మద్ సలీమ్
9949356387
9949146660
Love for All Hatred for None
మస్రూర్ హోటల్
టీ, టిఫిన్, మీల్స్, చికెన్ బిర్యాని, ఫాస్టు ఫుడ్ లభించును.
నాయుడు పెట్రోల్ పంపు, ఖమ్మం రోడ్, వరంగల్, తెలంగాణ
అన్ని కంపెనీల సెల్ రిచార్జ్‌లు చేయబడును.

పార్కింగ్‌కు సంబంధించిన శాఖ. ఇది కూడ చాలా ప్రాధాన్యత గల శాఖ. కొన్నిసందర్భాలలో అతిథులు ఈ శాఖ విషయంలో తప్పుగా నడుచుకొందురు. విధులలో ఉన్న వారి సలహాలకు విరుద్ధముగా పార్కింగ్ చేయుటకు, తమకు నచ్చిన ప్రదేశంలో పార్కింగ్ చేయుటకు ప్రయత్నిస్తారు. అట్టి పరిస్థితులలో అచట విధులు నిర్వహించే వారు అతిథులకు చాలా మృదువుగా సర్దిచెప్పాలి. వినినిచో ఆ తరువాత తమ పై అధికారులతో వారిని గూర్చి పిర్యాదు చేయాలి. గత సంవత్సరము కూడ ఈ విషయంలో కొందరు మహిళలు లేదా యువతులు తమ కార్లను ముందుకు తీసుకవెళ్ళే క్రమమంలో విధి నిర్వాహకులతో సంభాషించుచున్న సమయంలో కఠిన పదజాలంను ఉపయోగించిరి. ఈ విషయంపై నాకు పిర్యాదు అందినది. నిర్వాహకులు తమ బాధ్యతలను నిర్వహించడం అనివార్యము. ప్రత్యేకించి ప్రస్థుత సమయంలో పరిస్థితుల దృష్ట్యా పార్కింగ్ అంశంలో చాలా జాగ్రత్తలు తీసుకోవడం అనివార్యము. అయిన కూడ సత్ప్రవర్తనను ప్రదర్శించుట కూడ ముఖ్యం. ఒకవేళ ఏవరికైన ఏదైన సమస్య ఉన్నచో, లేదా అనారోగ్యముతో ఉన్నచో, మరే విధమైన కారణమే ఉన్నచో అట్టి వారికి మృదుస్వభావంతో నేను నా పై అధికారిని తెలుసుకొని మీకు తగిన న్యాయం చేస్తానని వారికి సర్ది చెప్పవలెను. ఆ తరువాత ఆ సమయం వరకు మీరు ప్రక్కన వేచియుండుము అని వారిని మరోచోటుకు తరలించాలి. అట్టి పరిస్థితులలో అతిథులు కూడ విధి నిర్వాహకులకు సహకారం అందించాలి. తద్వార ట్రాఫిక్ వలన సమస్యలు తలెత్తవు. ఎందుకనగా కొన్ని సందర్భాలలో వీరి సంప్రదింపుల వలన వెనుకాల కారులు బారులు తీరుతుంటాయి. వాటి వలన ఇతరులకు ఇబ్బందులు ఎదురవును. ఆ తరువాత జల్సా ప్రాంగణంలోకి ప్రవేశించడంతో ఉపన్యాసములు ఆలకించుతున్న వారికి అంతరాయం కల్గుతుంది.

గత సంవత్సరము ఎదురైన సమస్యలన్నింటికి సరైన పరిష్కారంను నిర్వాహకులు కనుగొనాలి. ఏ శాఖలో ఇలాంటి సమస్యలు తలెత్తునో ఆయా శాఖల వారు తగు జాగ్రత్త చర్యలను చేపట్టాలి. ఆ తరువాత జల్సా సాలాన అధికారులకు ఆయా సమస్యలపై తగిన సూచనలు, సలహాలు ఇవ్వవలెను. తద్వారా వాటిని ఈ సంవత్సరం నివారించవచ్చును. చిన్న చిన్న సమస్యలు ఎదురవుతూనే ఉంటాయి, కాని సాధ్యమైనంత వరకు వాటిని తగ్గించుటకు ప్రయత్నించాలి.

స్కానింగ్ మరియు చెకింగ్ చేయు ప్రదేశాలలో చాలా జాగ్రతలను తీసుకోవాలి. అంతేగాకుండా ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా వారిని చెక్ చేసి పంపినచో దూర దూరం వరకు అతిథులు క్యూలు కట్టవలసిన అవసరం ఏర్పడదు. ఏవరికి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావు. ప్రవేశ ద్వారాలలో, జల్సా ప్రాంగణంలోకి ప్రవేశించు వారిని తమ తమ కార్డులను చూపించవలెనని, క్యూ పద్దతిని పాటించాలని పదే పదే ప్రకటణలు చేయవలెను. తద్వారా త్వర త్వరగా లోనికి వెళ్ళవచ్చును.

అదే విధముగా స్నానపు గదులను శుభ్రపర్చు సేవకులు కూడ స్త్రీల, పురుషుల స్నానపు గదులను శుభ్రముగా ఉంచవలెను. అక్కడ కూడ చాలా చెత్త చెదారం ఉంటుంది. కావున "పరి శుభ్రతను పాటించుట విశ్వాసంలో భాగమని", అందుకే పరిశుభ్రతను, పారిశుధ్యమును పాటించవలెనని, స్నానపు గదులను, మరుగు దోడ్లను పరి శుభ్రముగా ఉంచవలెనని పదే పదే సేవకులు అతిథులకు ప్రకటించటంలో ఎలాంటి తప్పిదము లేదు. సాధారణంగా ప్రజలు సహకరిస్తుంటారు. గత సంవత్సరము కూడ సహకరించునట్లు నివేదిక కూడ నాకు అందినది. ఒకవేళ ఏవరైన సహకరించనిచో సేవకులు స్వయంగా పరిశుభ్రము చేయవలెను. ఇదే వారి విధి. అందువలనే సేవకుల నుండి ఎలాంటి దుష్కాకర్మలు జరుగ కూడదు. ఎల్లప్పుడు సహనం ను పాటించాలి.

అదే విధముగా జల్సా ప్రాంగణపు పరిశుభ్రత కూడ పరిశుద్ధ శాఖకు చెందిన బాధ్యతయే. జల్సా ప్రాంగణంలో పిల్లలు, మహిళలు, కొన్ని సందర్భాలలో పెద్దలు కూడ కాగితపు ముక్కలు, బాక్సులు, గ్లాసులు మొ॥నవి వేస్తుంటారు, కావున వారందరికి ఇటు వైపు శ్రద్ధ చూపించినచో పరిసరాలు పరిశుభ్రముగా ఉండును. ఒకవేళ అతిథులు సహకరించనిచో సేవకులు స్వయంగా చెత్త, చెదారంను తీసివేయవలెను. తద్వారా జల్సా ముగిసిన పిదప సామాగ్రిని ప్రోగు చేస్తున్నప్పుడు సులభం కలుగుతుంది. ఎందుకనగా కేవలం అక్కడి నుండి మార్కియాట్ లేకా పెద్ద పెద్ద వస్తువులను మాత్రమే ప్రోగు చేయకుండా చిన్న చిన్న వస్తువులను కూడ అక్కడి నుండి తొలగించవలసి ఉంటుంది. అప్పుడే కౌన్సిల్ నుండి క్లియరెన్స్ లభిస్తుంది. మొత్తానికి ఇటు వైపు అనగా డబ్బాలు, కాగితాలు ఎక్కడ పడితే అక్కడ వేసే బదులు చెత్త బుట్టలలో వేయాలని అతిథులకు మృదుతత్వంతో శ్రద్ధ చూపుటకు ప్రయత్నించాలి.

సభలో పాల్గొనుటకు ప్రజలు వస్తారు. కాని పాల్గొనే వారికి సభ ప్రాముఖ్యత తెలిపే విధముగా శిక్షణ విభాగము క్రియాశీలకంగా వ్యవహరించవలసిన అవసరమున్నది. సేవకుడు తనను తాను సమర్పించినప్పుడు నిస్వార్థముగా సేవ చేయుట సేవకుని కర్తవ్యము. నేనింతకు ముందు చెప్పినట్లు సేవకులు ఇదే స్ఫూర్తితో సేవలు చేస్తారు. కాని కొందరు దుష్ప్రవర్తన కూడ చూపెదరు. ఎట్టి పరిస్థితిలోనైనా సత్ప్రవర్తనతో వ్యవహరించాలను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశమును వారు గుర్తుంచుకోవలెను.

ఇదే విధముగా ప్రతి సేవకుడు అనుక్షణం జాగ్రత్తగా యుండవలెను. రక్షణ కేవలం రక్షణ విభాగ బాధ్యత మాత్రమే కాదు. ప్రతి విభాగములోని ప్రతి సేవకుడు తన చుట్టు నిఘా పెట్టవలెను.

సభ ముగిసిన తరువాత అక్కడ కేవలం వైండ్అప్ సేవకులు మాత్రమే కాక ప్రతి సేవకుడు అప్పుడు సభా ప్రాంగణములోనే యుండవలెను. అక్కడ ఒక్క అతిథి యున్నా లేదా వారి అధికారి మీ విధులు ముగిసినవి ఇక మీరు వెళ్లిపోవచ్చునని చెప్పేంత వరకు వెళ్లిపోకూడదు.

అన్నిటికంటే ముఖ్యమైన విషయం ఏమనగా ప్రతి ఒక్కరు గొప్ప రీతిలో సేవలు చేయు అనుగ్రహము పొందాలని సేవకులు కూడ జమాఅత్ సమస్త సభ్యులు కూడ దుఆ చేయవలెను. ఇప్పుడక్కడ సేవలందించుచున్న సేవకులందరిని అల్లాహ్ తఆలా రక్షించుగాక! కొన్ని సార్లు చాలా పెద్ద పెద్ద పనులు చేయవలసి వచ్చును. కొన్ని సార్లు గాయాలయ్యే ప్రమాదముండును. అల్లాహ్ తఆలా ప్రతి ఒక్కరిని అన్ని విధాలా రక్షించుగాక!

అల్లాహ్ తఆలా ఈ సభను అన్ని విధాలా శుభప్రదము, జయప్రదము కూడ చేయుగాక! ప్రతి వ్యతిరేకి, దుస్వభావము గల వ్యక్తిచే నష్టము కలగకుండా అన్ని విధాలా రక్షించుగాక! హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సభకు వచ్చిన అతిథులకు గొప్ప రీతిలో సేవచేయు భాగ్యమును అల్లాహ్ తఆలా ప్రతి ఒక్కరిని అనుగ్రహించుగాక! సత్ప్రవర్తనతో సేవలందింతురు గాక!

సేవకులు పొందిన గొప్ప ప్రామాణికములను లేదా వారు చేరిన ప్రామాణికములను దాటి ప్రతి సారి సేవ చేయువారగుదురు గాక! ఈ సారి కూడ గతమును మించి సేవ చేయువారగుదురు గాక! ఇందులో ఎన్నడు తగ్గుదల రాకూడదు. మన ప్రతి అడుగు ముందుకు పడే విధముగా యుండవలెను. ఇలా సేవ చేసినందుకు అల్లాహ్ తఆలా ప్రేమ పూర్వక చూపు కూడ పడును. అల్లాహ్ తఆలా అందరిని ఇందుకు అనుగ్రహించుగాక!

(ఆమీన్)

❖❖❖

EDITOR
SYED RASOOL NIYAZ
SUB EDITOR: MOHAMMAD AKBAR
Mobile. :(+91) 9948692101
e-mail :badartel001@gmail.com
website:www.akhbarbadarqadian.in
:www.alislam.org

Title Code: PUNTEL00001
The Weekly BADAR Qadian బదర్ వార పత్రిక ఖాదియాన్
Distt: Gurdaspur (Pb.) INDIA Qadian - 143516
Vol.1. Thursday 08 SEP 2016 Issue No.27

MANAGER
NAWAB AHMAD
Tel : (+91)-1872-224757
Mobile. : (+91) 94170-20616
e-mail :managerbadrqnd@gmail.com
ANNUAL SUBSCRIPTION:Rs.300/-

మార్గదర్శనము వివేకము పొందువారు ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం శుభములు మహిమలను తిలకించువారు కేవలము రెండు వర్గాలుగానే నుండును. మొదటి వర్గము ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహివసల్లం అనుచరులు (సహాబా) వారు ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం రాకకు ముందు అంధాకారములో చిక్కుకొని యుండిరి, ఆ తరువాత వారు అల్లాహ్ అనుగ్రహముతో సందేశహరుని కాలమును పొందిరి. మహిమలను తమ కనులారా చూచిరి. భవిష్యవాణులను తిలకించిరి, నమ్మకము, విశ్వాసములలో వారందరిలో ఒకే ఆత్మయే ఉన్నదా? అన్నట్లుగా వారిలో మార్పు కల్గెను. ఈ సూక్తి ప్రకారము రెండవ వర్గము సహాబాల వలె యుండు మసీహ్ మౌవూద్ వర్గము. ఎందుకనగా: ఈ వర్గము కూడా సహాబాల వలె ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహివసల్లం మహిమలను తిలకించును. దౌర్జన్యము అంధాకారము తరువాత మార్గదర్శనము పొందును. పై సూక్తి..లో ఈ వర్గమును "మిన్ హుమ్" అను వర్గముగా పేర్కొనబడెను. అనగా సహాబాలను పోలియుండి, శుభముల నుండి భాగము నొసంగబడినది అని అర్థం. అనగా ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహివ సల్లం మహిమలను, భవిష్య వాణులను సహాబా రిజ్వానుల్లాహి అజ్మయీన్ తిలకించినట్లు, వారు కూడా తిలకించెదరు. కాని మధ్య కాలము వారు ఈ వరముల నుండి సంపూర్ణముగా దూరముందురు. కావున నేడు అటులనే జరిగినది. పదమూడు వందల సంత్సరముల తరువాత మరల ఆహజ్రత్ సల్లల్లాహు అలైహివసల్లం మహిమల ద్వారము తెరువబడెను, వాటిని లోకులు తమ కనులారా తిలకించిరి. మరల వారిట్లు నుడివిరి.

మహమ్మారి వ్యాపించుటను, హజ్ యాత్రను ఆపబడుటను కూడా అందరు స్వయాన తిలకించిరి. దేశమునందు రైలు నడుచుట, ఒంటెలు వృథాయగుట వంటి ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహివసల్లం మహిమలను సహాబా రజియల్లాహు అన్‌హుమ్ చూచినట్లు నేడు కూడ ప్రజలు చూచిరి. అందువలనే అల్లాహ్ ఈ తుది వర్గమును "మిన్ హుమ్" అను పదముతో పిలిచెను, అనగా మహిమలను తిలకించుటలో వారు కూడా సహాబాను పోలియుందురు. పదమూడు వందల సంవత్సరములలో "మిన్‌హాజున్నబ్బువ్వత్" కాలమును పొందినవారెవరు?. నేటి కాలంలో మన జమాఅత్ ఉద్భవించినందున అనేక అంశాల పరంగా ఈ జమాఅత్‌నకు సహాబా రజియల్లాహు అన్‌హుమ్‌తో పోలికలు గలవు. సహాబా తిలకించునట్లు వీరు కూడ మహిమలను, సంకేతములను చూచెదరు. అల్లాహ్ సంకేతనములను క్రొత్త క్రొత్త ప్రోత్సాహకాలతో తేజోవంతమైనవిగా, విశ్వసనీయమైనవిగా సహబాలు పొందినట్లు వీరు పొందెదరు. అల్లాహ్ మార్గమునందు జనుల పరిహాసము, చీవాట్లను మరి వివిధములైన హృదయదారకములైన అనేక బాధలను సహాబా భరించునట్లు వీరు భరించుచున్నారు. అల్లాహ్ స్పష్టమైన సంకేతములను. ఆకాశపు సహాయములను వివేకమైన బోధనలతో, పవిత్రమైన జీవితమును సహాబా పొందినట్లు వీరు పొందుచున్నారు. వీరిలో అనేకులు సహాబాల వలె ప్రార్థనలో (సమాజ్‌లో) రోదించుచు సాష్టాంగ స్థలములను తమ కన్నీటితో తడుపుచున్నారు.

(అయ్యా ముస్సులహ్ – రూహాని ఖజాయిన్ సంపుటి – 14, పుట 305–306)

"ప్రపంచమునకు నేను జీవనము నొసంగుటకు వచ్చితిని" అను వారి(అ) వాజ్యము చాలా గొప్పగా పూర్తయ్యెను, అగుచున్నది. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహివసల్లం అనుసరణలో అల్లాహ్ వారి (అ) ద్వారా కూడ జగత్తునకు జీవనము ప్రసాదించుచున్నాడు. ఇపుడు అల్లాహ్ భాషణమును గ్రహించుట వారి (అ) ద్వారానే సాధ్యమగును. ఇది తప్ప మరే మార్గము లేదు. పవిత్ర ఖురాన్ విశ్లేషణ వాస్తవాలను తెలుపుట వారి (అ) కార్యము, జనులకు ఆధ్యాత్మిక జీవనము వారి ద్వారానే ఇప్పుడు లభించుచున్నది. లభించవచ్చును. పదునాలుగు వందల సంవత్సరముల తరువాత ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహివసల్లం సమగ్ర అనుసరణ, ప్రేమలో మునిగి సంపూర్ణ కార్యాచరణమునకు నిదర్శనమును వారే ప్రదర్శించిరి. కావున ఈ కార్యాచరణను అనుసరించినచో ఈ నైతిక జీవితమును పొందు భాగ్యము నేడు కూడా గలదు. కాని ఇస్లాంను అపవాదమునకు గురి చేయువారు ఈ అంశాలను పట్టించుకోరు. ముస్లింల తప్పుడు కార్యములను చూచి పెద్దగా ఇస్లాంకు వ్యతిరేకంగా ప్రచారము చేయుదురు, ఆక్షేపణల వర్షము కురిపింతురు.

అందువలనే ఈ కాలములో కూడా తన ప్రవక్తను పంపి, తన బోధనను పునరుద్ధరించి, ముస్లింలకు అల్లాహ్ గొప్ప మేలు చేసెను. ఆధ్యాత్మిక జీవితము పొందుట కూడ ఒక గొప్ప భాగ్యము. అల్లాహ్ నియమించినవారు, అల్లాహ్‌ను, వారిని అనుసరించినచో వారి సమాజంను వారు విజయ పంథాలో పడవేయుదురు. వారికి ఆధ్యాత్మిక జీవితము ప్రసాదించెదరు . మిగిలిన వారు అపజయము నొంది తిరస్కరింపబడుదురు. హజ్రత్ మసీహ్‌మౌవూద్ అలైహిస్సలాంతో కూడ అల్లాహ్ ఇదే వాగ్దానము చేసియున్నాడు. అందుకే వారు జయము నొందుచున్నారు, ఇకపై కూడ జయము నొందెదరు. వారిని విశ్వసించిన వారు ప్రగతి పొందుచూ పోవుదురు. ఇన్షా అల్లాహ్. వారి తరువాత కార్యమును కొనుసాగించుటకు ఖిలాఫత్ పాలన కొనసాగుచున్నది. ఈ కార్యమునకెదురుగా ఏదేని పాలన వచ్చినను అది అపజయము నొందును. ఖిలాఫత్ అను వరము అల్లాహ్ వైపు నుండి ప్రసాదించబడును. బలవంతముగా తీసుకోబడదు. దౌర్జన్యముతో పొందబడదు. అమాయకులను హతమార్చినచో లభించదు. దౌర్జన్య పద్ధతిలో, సంహరించి ఈ పాలనను వశపరచకోలేరు. ఈ పాలన కూడ జీవితమును నొసంగును, జీవితములను నాశనమొనర్చదు. ఇది అల్లాహ్ సహాయ సహకారాలు లేనిదే అసాధ్యము. కావున బలవంతముగా వశపరుచుకొను ఏ ప్రణాళిక, పాలనకు అల్లాహ్ సహాయ సహకారాలు ఉండవని గుర్తుంచుకోవాలి..................

**(సశేషం)**




Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of the Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz